క్లుప్తంగా

దశభుజ గణపతికి వెండికొమ్ము బహూకరణ



వెండి కొమ్మును అందిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప, చేనేత విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పొరాళ్ల శివకుమార్

రాయదుర్గంటౌన్: పట్టణంలోని ఆత్మకూరు వీధిలో వెలసిన దశభుజ మహాగణపతికి మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప, వైఎస్సార్‌సీపీ చేనేత విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పొరాళ్ల శివకుమార్ కుటుంబ సభ్యులు వెండి కొమ్మును బహూకరించారు.

యాంత్రీకరణతో పెట్టుబడి ఖర్చు పొదుపు

కూడేరు: వ్యవసాయ యాంత్రీకరణతో పంటల సాగులో పెట్టుబడి ఖర్చు తగ్గించుకోవచ్చని, దిగుబడిని పెంచుకోవచ్చని ఏఓ శుభకర్ తెలిపారు. గురువారం పి.నారాయణపురంలో వ్యవసాయాధికారులు 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు. మొక్కజొన్న, ఆముదం, వేరుశగన పంటలకు సోకే తెగుళ్లు, వాటి నివారణ చర్యలపై రైతులకు అవగాహన కల్పించారు. పంటల బీమా, అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ పథకాల లబ్ధిని ఏవిధంగా పొందాలో వివరించారు. కార్యక్రమంలో ఏఈఓ రాఘవేంద్ర, వీఏఏలు రాజకుమార్, జయప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

సబ్సిడీతో గడ్డి విత్తనాలు

కూడేరు: పశు గ్రాసం కోసం ప్రభుత్వం సబ్సిడీతో అందిస్తున్న గడ్డి జొన్న విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలని పశువైద్యాధికారి శ్రీనివాసులు గురువారం తెలిపారు. మండలానికి (కూడేరు,చోళసముద్రం ఆస్పత్రుల పరిధిలో) 4 టన్నుల గడ్డి జొన్న విత్తనాలు సరఫరాఅయినట్లు ఆయన తెలిపారు. సబ్సిడీతో కేజీ జొన్నలు రూ.23తో గరిష్టంగా ఒక రైతుకు 20 కేజీలు వరకు ఇస్తామన్నారు.

3న పాలిటెక్నిక్ కళాశాలలో జాబ్‌మేళా

రాయదుర్గంటౌన్: స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో సెప్టెంబర్ 3న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి ప్రతాప్‌రెడ్డి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రముఖ 12 ఎన్ఎంసీ కంపెనీల ఆధ్వర్యంలో జాబ్‌మేళా ఉంటుందన్నారు. పది, ఇంటర్, డిగ్రీ పూర్తి చేసిన నిరుద్యోగులు జిరాక్స్ కాపీలతో జాబ్‌మేళాకు హాజరుకావచ్చని తెలిపారు. వివరాలకు సెల్: 9182920381లో సంప్రదించాలన్నారు.

వాహనదారులకు హెల్మెట్ల పంపిణీ



వాహనదారులకు హెల్మెట్లు అందిస్తున్న సీఐ, ఎస్ఐలు, దాత కేశవ్‌లు

ఉరవకొండ: సామాజిక కార్యకర్త కేశవ్ గురువారం హెల్మెట్లు పంపిణీ చేశారు. స్థానిక అర్బన్ పోలీసు స్టేషన్ వద్ద అర్బన్ సీఐ మహానంది, ఎస్ఐ జనార్దన్‌నాయుడుల చేతుల మీదుగా 20 మంది వాహనదారులకు హెల్మెట్లు అందించారు. అనంతరం సీఐ మాట్లాడుతూ కేశవ్ ఎంతో సామాజిక బాధ్యతతో వాహనదారులకు హెల్మెట్లు అందించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సునీత, సాయిశ్రీ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్‌లోని రాగివైరు చోరీ

బొమ్మనహాళ్: నరసాపురం సమీపంలో రైతు దొడగట్ట కిష్టప్ప వ్యవసాయ తోట వద్దనున్న ట్రాన్స్‌ఫార్మర్‌ను బుధవారం రాత్రి దుండగులు ధ్వంసం చేసి, రాగివైరు ఎత్తుకెళ్లారు. ఈవిషయంపై బాధిత రైతు గురువారం పోలీసులకు,విద్యుత్ శాఖ ఏఈ గంగాదర్ గుప్తకు ఫిర్యాదు చేశాడు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శివ తెలిపారు.

ఒంటరి మహిళకు ఆసరా



మహిళలకు కుట్టు మిషన్లు అందిస్తున్న దాతలు

కళ్యాణదుర్గం: బ్రహ్మసముద్రం మండలం వేపులపర్తికి చెందిన ఒంటరి మహిళ సుశీలమ్మకు కుటుంబానికి ఇన్ఫినిటీ చారిటబుల్ ట్రస్ట్ నిలిచింది. రెండేళ్ల క్రితం సుశీలమ్మ భర్త ఆటో ప్రమాదంలో మృతి చెందగా, తన ముగ్గురు ఆడపిల్లల పోషణ భారమైంది. విషయం తెలుసుకున్న చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ బద్దేనాయక్ .. బాధిత కుటుంబానికి బుధవారం ట్రస్ట్ కార్యాలయంలో కుట్టుమిషన్లు, రూ.3వేల సామగ్రి అందించారు. కార్యక్రమంలో ట్రస్ట్ వైస్ చైర్మన్ సురేష్ కుమార్, సభ్యులు అబ్దుల్ వహాబ్, తిప్పేస్వామి, చిరంజీవి, మహేష్ పాల్గొన్నారు.



రాయదుర్గంలో ఆకట్టుకున్న దశభుజ మహాగణపతి



రాయదుర్గంలో కృష్ణుడు, రాధిక రూపంలో గణపతి



రాయదుర్గంలో రాఘవేంద్ర స్వామి ఒడిలో బాలగణేశుడు



గుమ్మఘట్ట: గోనబావి క్రాస్‌లో కొలువుదీరిన గణనాథుడు



మారెంపల్లి కాలనీలో శ్రీరాముని వేషధారణలో వినాయకుడు



కళ్యాణదుర్గంలో కొలువుదీరిన వినాయకుడు



కళ్యాణదుర్గంలో విరక్తి మఠంలో వన గణపతి



ఉరవకొండలో ముత్యాల అలంకరణలో గణనాథుడు



ఉరవకొండలో బియ్యపు గింజల గణనాథుడు

పార్వతీ తనయ నమోనమః



కంబదూరులో బొజ్జగణపయ్యతో స్థానికులు



బెళుగుప్పలో వెండి కవచంతో దర్శనమిస్తున్న విఘ్నేశ్వరుడు, నీలమేఘశ్యామ గణపతులు



ఉరవకొండ ఎస్ఎల్‌సీ కాలనీలో పూజలో పాల్గొన్న ఎమ్మెల్సీ శివరామిరెడ్డి



కుందుర్పిలో భారీ వినాయకుడికి పూజలు చేస్తున్న దృశ్యం



బొమ్మనహాళ్: వినాయకుడికి పూజలు నిర్వహిస్తున్న భక్తులు



బెళుగుప్ప కోటవీధిలో ఏర్పాటు చేసిన అయోధ్య రామాంజనేయ గణపతి

రాయదుర్గంటౌన్: నియోజకవర్గ వ్యాప్తంగా వినాయక చవితి వేడుకలు బుధవారం నుంచి భక్తిశ్రద్ధలతో ప్రారంభమయ్యాయి. వినాయక సర్కిల్, బళ్లారి రోడ్డు, గంగమ్మబావి ఏరియా, తేరు బాజారు, నీలకంఠేశ్వరస్వామి ఆలయం, మార్కండేయస్వామి ఆలయం, ఓబుళాచారి రోడ్డు, పాండురంగస్వామి ఆలయం, పార్వతీనగర్, బొడ్డురాయి, వాసవీ కళ్యాణ మంటపం , నేతాజీ రోడ్డు, చౌడేశ్వరిదేవి గుడి, 7వ వార్డు సత్యనారా యణ స్వామి ఆలయం, కోటలోని వెంకటేశ్వర స్వామి ఆలయాల వద్ద, అనంతపురం రహదారిలోని వివిధ ప్రాంతాల్లో వినాయక మంటపాల్లో వివిధ రూపాల్లో గణనాథులు కొలువుదీరారు.

గుమ్మఘట్ట: మండల వ్యాప్తంగా వినాయక చవితి వేడుకలు ఘనంగా జరిపారు. విఘ్నాలు కలగకుండా వర్షాలు సమృద్ధిగా కురిసి, పంటలు బాగా పండాలని భక్తులు గణనాథుని వేడుకున్నారు.

బొమ్మనహాళ్: బొమ్మనహాళ్, ఉద్దేహాళ్, దర్గాహొన్నూరు, గోవిందవాడ, శ్రీధరఘట్ట, ఎల్‌బీ నగర్, గోనేహాళ్, దేవగిరి, ఉంతకల్లు, నేమకల్లు, లింగదహాళ్, శింగానహళ్లి, బొల్లనగుడ్డం, సిద్ధరాంపురం, శింగానహళ్లి, బందూరులో విగ్రహాలను ఏర్పాటు చేశారు.

కణేకల్లు: కణేకల్లులో వినాయక చవితి వేడుకలను ప్రజలు భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. చిక్కణ్ణేశ్వరస్వామి, స్వయంభేశ్వరస్వామి, సిద్దేశ్వర స్వామి, దేవమ్మదేవీ ఆలయం, రామనగర్, నేసేపేట, ఉరవకొండ రోడ్డు, కొత్తకొట్టాల తదితర ప్రాంతాల్లో వినాయకులు కొలువుదీరారు. మూడు, ఐదో రోజున వినాయక నిమజ్జనం చేయనున్నారు.

వాడవాడలా కొలువుదీరిన బొజ్జగణపయ్య

కళ్యాణదుర్గం: నియోజకవర్గంలోని అన్ని మండలాలు, గ్రామాల్లో వినాయక చవితి పండుగను బుధవారం భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. మూడు రోజుల అనంతరం నిమ్మజ్జనాలతో వేడుకలు ముగుస్తాయి. సీఐలు యువరాజ్, నీలకంఠేశ్వర్, వంశీకృష్ణ పర్యవేక్షణలో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

బహురూపాల్లో ఏకదంతుడు

ఉరవకొండ: పట్టణంలో వినాయక చవితి ను పురస్కరించుకొని బుధవారం నుంచి ప్రత్యేక పూజలు ప్రారంభించారు. అయ్యప్పస్వామి ఆలయం వద్ద బాల గణపతి ఉత్సవసమితి ఆధ్వర్యంలో ముత్యాల వినాయకుడి ప్రతిమ ఆకట్టుకుంది. అంబేడ్కర్‌నగర్‌లో 9 రకాల బియ్యంతో జమ్మనగణపతిని కొలువుదీర్చారు. వరసిద్ధి వినాయక సమితి ఆధ్వర్యంలో 14 అడుగుల వినాయక విగ్రహం ఏర్పాటు చేశారు. పాతపేట 8వ వార్డులో వరసిద్ధి వినాయక సేవా సమితి వినాయకుడు, పేటవీరభద్రస్వామి ఆలయంలో శివాజీమహారాజ్ అలంకరణలో వినాయకుడు ఆకట్టుకున్నాడు.

ఉరవకొండ రూరల్: మండల వ్యాప్తంగా చవితి వేడుకలు బుధవారం ప్రారంభమయ్యా యి. బొజ్జగణపయ్య ప్రతిమలు కొలువుదీరాయి. ఎస్ఎల్ఎన్ కాలనీలో ఎమ్మెల్సీ శివరామిరెడ్డి పూజలు చేశారు. ఎమ్మెల్సీని ఉత్సవ కమిటీ ప్రతినిధులు సన్మానించారు.

కూడేరు: మండల వ్యాప్తంగా బుధవారం వినాయక చవితిని ప్రజలు భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. పలు గ్రామాల్లో వివిధ రూపాల్లో కొలువ దీరిన వినాయక విగ్రహాలు అందరినీ ఆకట్టుకున్నాయి.

వజ్రకరూరు: మండలంలోని వివిధ గ్రామాల్లో బుధ, గురువారాల్లో వినాయక చవితి వేడుకలు ఘనంగా జరిగాయి. అన్ని గ్రామాల్లో గణనాథులు కొలువుదీరారు.

కూడేరు: స్థానిక సీపీఎం కార్యాలయంలో 2000లో విద్యుత్ చార్జీలు తగ్గించాలని చేపట్టిన పోరాటంలో అసువులుబాసిన బాలస్వామి, రామకృష్ణ, విష్ణువర్ధన్ రెడ్డి చిత్రపటాలకు సీపీఎం నాయకులు గురువారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మండల నాయకులు వెంకటేశులు,రాధాకృష్ణ, పెద్దన్న, మల్లికార్జున పాల్గొన్నారు.


గ్రామాల్లో కొలువుదీరిన గణనాథులు

బెళుగుప్ప: మండలంలో వినాయక చవితి పండుగ ను బుధవారం నిర్వహించారు. బెళుగుప్పలోని కా ల నీలు, గుండ్లపల్లి, జీడిపల్లి, నక్కలపల్లి, నరసాపురం, యలగలవంక, వెంకటాద్రిపల్లి, విరుపాపల్లి, రమణేపల్లి, హనిమరెడ్డిపల్లి, బెళుగుప్ప తండా, గంగవరం, రామసాగరం, అంకంపల్లి, జీడిపల్లి, కాలువపల్లి, ఆవులెన్న, శీర్పి, ఎర్రగుడి, దుద్దేకుంట, తగ్గపర్తి లో విగ్రహాలకు పూజలు చేశారు.

కుందుర్పి: మండలంలోని 36 గ్రామాల్లో వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. కుందుర్పిలో 10 చోట్ల విగ్రహాలను ఏర్పాటు చేశారు.



బొమ్మనహాళ్ మండలం ఉద్దేహాళ్‌లో గణేశుడికి ప్రత్యేక పూజలు



ఉరవకొండలో భారీ వినాయకుడు



పెద్దముష్టూరులో పార్వతీ సుతుడు



వజ్రకరూరు బలిజవీధిలో కొలువు దీరిన వినాయకుడు



కూడేరు : శ్రీనివాసురావు కాలనీలో కొలువు దీరిన వినాయకుడు



కణేకల్లులోని చిక్కణ్ణేశ్వరస్వామి ఆలయ ఆవరణలో కొలువుదీరిన వినాయకుడు

ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలి



రాయదుర్గంలో వినాయకుడికి పూజలు నిర్వహిస్తున్న మెట్టు గోవిందరెడ్డి, నాయకులు

రాయదుర్గంటౌన్: విఘ్న వినాయకుడి కృపా కటాక్షాలతో ప్రజలు, రైతులు, కార్మికులందరూ సుఖ సంతోషాలతో ఉండాలని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి ఆకాంక్షించారు. పట్టణంలోని వినాయక సర్కిల్‌లో కొలువుదీరిన వినాయకుడి మంటపంలో వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మెట్టు గోవింద రెడ్డి, వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌని ఉపేంద్రరెడ్డి హాజరై పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. చేనేత విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పొరాళ్ల శివకుమార్, వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ మేకల శ్రీనివాసులు, కోఆప్షన్ సభ్యుడు శ్రీనివాసులు, గ్రీవెన్స్ విభాగం అధ్యక్షుడు మురడి మురళీమోహన్‌రెడ్డి, నాయకులు రామాంజనేయులు, పట్టణ ప్రచార కార్యదర్శి తిప్పేస్వామి, బోర్‌వెల్ ఆనందరెడ్డి హాజరై పూజలు చేశారు.

వినాయకుడికి మెట్టు ప్రత్యేక పూజలు

రాయదుర్గం: సకలవిఘ్నాలు తొలగించే గణేశ్ ఉత్సవాలు రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల్లో బుధవారం భక్తిశ్రద్ధలతో ప్రారంభమయ్యాయి. పండుగ పర్వదినాన్ని ప్రజలు ఆనందోత్సవాల మధ్య జరుపుకున్నారు. వాడవాడలోనూ గణనాథుడి మంటపాలు ఏర్పాటు చేసి, వేదమంత్రోచ్ఛారణల మధ్య ప్రతిష్టించారు. పట్టణంలోని వినాయసర్కిల్, గంగమ్మబావి, శాంతినగర్, కణేకల్లు రోడ్డు, బీటీపీ రోడ్డు, అంబేడ్కర్, వాల్మీకి నగర్‌తో పాటు కోట ప్రాంతం , కోతిగట్టు, పలు శివారు కాలనీల్లో యువత సందడి చేశారు. అర్బన్, రూరల్ ప్రాంతాల్లో సీఐ జయనాయక్, వెంకటరమణ బందోబస్తు ఏర్పాటు చేయించారు.

ప్రత్యేక పూజలు నిర్వహించిన మెట్టు: వినాయచవితి పురస్కరించుకుని వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే మెట్టు గోవిందరెడ్డి పట్టణంలోని పలు మంటపాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రజలందరూ సుఖ సంతోషాలు, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. మెట్టు వెంట వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉరవకొండవాసులకు శ్మశాన కష్టాలు

- ఏపుగా పెరిగిన ముళ్ల కంప పొదలు
- మృతదేహాలను ఖననం చేసేందుకు పాట్లు



శ్మశానంలో ఏపుగా పెరిగిన ముళ్ల కంపలు

ఉరవకొండ రూరల్: పట్టణ వాసులకు శ్మశాన వాటికకు స్థలం లేక అవస్థలు పడాల్సి వస్తోంది. ఎవరైనా మృతిచెందితే అంత్యక్రియలు నిర్వహించేందుకు పడరాని పాట్లు పడాల్సి వస్తోంది. ఉరవకొండ మేజర్ పంచాయతీలో 50 వేలకు పైగా జనాభా నివసిస్తున్నారు. జనాభాకు సరిపడా శ్మశాన స్థలం లేదు. దీంతో ఉన్న శ్మశాన స్థలంలోనే అన్ని వర్గాలకు చెందిన వారు అంత్యక్రియలు నిర్వహించుకోవాల్సి వస్తోంది. అయితే ప్రస్తుతం ఉన్న శ్మశాన స్థలంలో ముళ్ల పొదలు ఏపుగా పెరిగాయి. కనీసం అంత్యక్రియల సమయంలో అడుగుతీసి అడుగేయలేనంతగా అధ్వానంగా ఉంది. తమ వారి సమాధులు ఎక్కడున్నాయో గుర్తుపట్టలేనంతగా శ్మశానంలో ముళ్ల కంపలతో పరుచుకున్నాయి. ఒక్కోసారి శవపేటికను మోసేవారు ముళ్ల కంపలను తొక్కి గాయపడ్డారు. ప్రభుత్వం స్పందించి శ్మశాన వాటికలో ముళ్ల కంపలను తొలగించి, అదనపు స్థలాన్ని కేటాయించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

వైఎస్సార్‌సీపీ సీనియర్ కార్యకర్త మృతి



దేవేంద్ర భౌతికాయానికి నివాళులర్పిస్తున్న మెట్టు గోవిందరెడ్డి

కణేకల్లు: మండలంలోని సొల్లాపురంలో వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు దేవేంద్ర (62) బుధవారం మధ్యాహ్నం మృతి చెందారు. దేవేంద్ర కొన్ని నెలలుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. రాయదుర్గం సమన్వయకర్త మెట్టు గోవింద రెడ్డి, మండల కన్వీనర్ పాటిల్ బ్రహ్మానందరెడ్డి, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు పైనేటి తిమ్మప్పచౌదరి, వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మారెంపల్లి మారెన్న, పంచాయతీరాజ్ వైఎస్సార్‌సీపీ జిల్లా విభాగం ప్రధాన కార్యదర్శి ఆదిసద్గురు చంద్రశేఖర్ రెడ్డి, సర్పంచు భాస్కర్‌రెడ్డి, స్థానిక నాయకులు రామ్మోహన్‌రెడ్డి, జగన్నాథరెడ్డి, శివరామిరెడ్డి, శ్రీధర్‌రెడ్డి, సోమలింగారెడ్డి, ఎస్.గురునాథరెడ్డి, జయచంద్రారెడ్డి, మల్లేగౌడ్, నాగిరెడ్డి దేవేంద్ర భౌతికాయానికి పూలమాలలేసి నివాళులర్పించారు.

పి.నారాయణపురం సర్పంచుకు సన్మానం



సర్పంచ్ హనుమంత రెడ్డిని సన్మానిస్తున్న కలెక్టర్ వినోద్ కుమార్

కూడేరు: మండలంలోని పి.నారాయణపురం సర్పంచ్ హనుమంత రెడ్డి జలస్వచ్ఛత, బాలల స్నేహ పూర్వక గ్రామం, సర్పంచ్ సంవాద్ యాప్ అభివృద్ధిలో ఆయన చేసిన కృషిని గుర్తించి సర్పంచ్ సంవాద్ క్యుసీఐ అడ్వైజరీ కమిటీ సభ్యుడిగా ఎంపిక చేశారు. దీంతో గురువారం అనంతపురంలో జిల్లా కలెక్టర్ వినోద్ కుమార్ సర్పంచ్ హనుమంత రెడ్డికి శాలువా కప్పి సన్మానించారు. కార్యక్రమంలో ఎన్ఐసీ పీడీ నాగలక్ష్మి, డీఎంసీ శ్రీదేవి,డీసీపీఓ మంజునాథ్ తదితరులు పాల్గొన్నారు.

పశువుల మంద దాడిలో పలువురికి గాయాలు





క్లాక్‌టవర్ వద్ద దాడికి కారణమైన ఎద్దులు, ఆవుల మంద, దాడిలో గాయపడిన కిరణ్ అనే యువకుడు

ఉరవకొండ: నిత్యం క్లాక్‌టవర్ వద్ద ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిలిగిస్తున్న పశువుల మంద గురువారం ఒక్కసారిగా జనంపైకి దూసుకురావడంతో 10 మంది గాయపడ్డారు. వివరాలు.. ఉరవకొండ క్లాక్‌టవర్ రోడ్డుపై నిత్యం 20 నుంచి 30 వరకు ఆవులు, ఎద్దుల గుంపు ట్రాఫిక్‌కు అడ్డంగా తిష్టవేస్తున్నాయి. దీంతో ఎద్దులు పోట్లాడుతూ జనంపై దూసుకురావడంతో అక్కడి జనం తీవ్ర భయభ్రాంతులకు గురయ్యారు. వాటి నుంచి తప్పించుకోవడానికి ప్రయత్నించారు. ఎద్దుల దాడిలో ఉరవకొండకు చెందిన కిరణ్, ప్రభాకర్, గోవిందు, నాగరాజు, స్వప్న, జ్యోతికతో పాటు మరికొందరు గాయపడ్డారు. వీరి కాలు, చేయి, తలకు బలమైన గాయాలయ్యాయి. గాయపడిన వారిని ఉరవకొండ ప్రభుత్వాస్పత్రిలో ప్రథమ చికిత్స అందించారు. పశువులను పంచాయతీ కార్యదర్శి గౌస్ సాహెబ్, సిబ్బంది ఆధ్వర్యంలో మరోచోటకు తరలించారు. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు క్లాక్‌టవర్ వద్ద పశువుల మంద లేకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

సంక్షిప్త సమాచారం

రేపు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

రాయదుర్గంటౌన్: రాయదుర్గం పురపాలక సంఘంలోని కౌన్సిల్ హాల్‌లో ఈనెల 30న ఉదయం 11 గంటలకు కౌన్సిల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప ఓ ప్రకటనలో తెలిపారు. సమావేశంలో పట్టణంలో చేపట్టే అభివృద్ధి కార్యక్రమాలతోపాటు ప్రజా సమస్యలపై చర్చించనున్నట్లు చెప్పారు. సమావేశానికి వైస్ చైర్మన్లు, కౌన్సిల్ సభ్యులు, కోఆప్షన్ సభ్యులు, ఎక్స్ అఫీషియో సభ్యులు, విభాగాల వారిగా అధికారులు హాజరు కావాలని కోరారు.

శుభకార్యం

కుందుర్పి: మండలంలోని కొలిమిపాళ్యం, బెస్తరపల్లి గ్రామాల్లోని జేసీఎస్ కన్వీనర్ రాము, బెస్తరపల్లి వైఎస్సార్‌సీపీ నాయకులు బోయ ప్రసాద్ ఇళ్లలో గురువారం జరిగిన శుభకార్యాలకు మాజీ ఎంపీ తలారి రంగయ్య హాజరయ్యారు. సమన్వయకర్త వెంట పంచాయతీ నాయకులు ఎంపీపీ నాగరాజు, మండల కన్వీనర్ హనుయంతరాయుడు, వాల్మీకి కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ పాలాక్షి, తిప్పేస్వామి, సర్పంచ్ గంగాధర, మహేంద్ర, రంగప్ప, ఓబుళపతి, లింగప్ప, బీటీ రాము, బాబు తదితరులు ఉన్నారు.

ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

గుమ్మఘట్ట: ద్విచక్ర వాహనం పైనుంచి అదుపు తప్పి కిందపడిన ఘటనలో ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు.. గుమ్మఘట్ట మండలం గోనబావికి చెందిన వడ్డే తిమ్మప్ప (54)కు భార్య, ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. బతుకు తెరువు కోసం మంగళూరుకు వలస వెళ్లిన భార్య మూడేళ్ల క్రితం అక్కడే మృతి చెందింది. వ్యక్తిగత పనిపై వేపులపర్తి గ్రామానికి వెళ్లిన తిమ్మప్ప అక్కడ పని ముగించుకుని ద్విచక్రవాహనంపై స్వగ్రామానికి వెళుతూ.. అదే గ్రామ సమీపంలో కాలినడకన వెళుతున్న యువకుడ గణేష్‌ని ఢీకొని రోడ్డుపై పడి తీవ్రంగా గాయపడ్డాడు. ప్రమాదంలో స్వల్ప గాయాలతో గణేష్ బయటపడ్డాడు. తీవ్రంగా గాయపడిన తిమ్మప్పను స్థానికులు చికిత్స నిమిత్తం రాయదుర్గంలోని ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం అనంతపురంలోని జీజీహెచ్‌కు కుటుంబసభ్యులు తీసుకెళ్లారు. పరిస్థితి విషమించడంతో చికిత్సకు స్పందించక ఆయన మృతి చెందాడు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.

వ్యక్తికి తీవ్రగాయాలు



గాయపడిన ఆంజనేయులు

రాయదుర్గంటౌన్: మండలంలోని 74 ఉడేగోళం జాతీయ రహదారిపై గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో బొమ్మక్కపల్లికి చెందిన ఆంజనేయులు తీవ్రంగా గాయపడ్డాడు. అతన్ని స్థానిక ఏరియా ఆస్పత్రిలో చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం వైద్యులు అనంతపురానికి తరలించారు.

నిమజ్జన ఏర్పాట్ల పరిశీలన



నాన్ చెరువు వద్ద నిమజ్జన ఏర్పాట్లను పరిశీలిస్తున్న మున్సిపల్ అధికారులు

రాయదుర్గంటౌన్: పట్టణంలోని మొలకాల్మూరు రోడ్డు చెక్‌పోస్టు వద్దనున్న నాన్ చెరువులో వినాయక విగ్రహాల నిమజ్జనం కోసం జరుగుతున్న పనులను గురువారం అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి, ఏఈ నరసింహులు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రవీంద్రయాదవ్ అక్కడ జరుగుతున్న పనులను పరిశీలించారు. జేసీబీతో ఆప్రాంతంలో చదును చేయడం, లైటింగ్ వసతి, క్రేన్ ఏర్పాట్లపై సూచనలు అందజేశారు. నాన్ చెరువులో చిన్న పాటి విగ్రహాల మొదలుకొని 3 నుంచి 4 అడుగుల దాకా విగ్రహాలను మాత్రమే నిమజ్జనం చేయాల్సి ఉంటుందన్నారు. భారీ సైజు విగ్రహాలను కణేకల్లులోని కెనాల్‌కు తరలించాలని సూచించారు. నిర్వాహకులు తగిన జాగ్రత్తలతో విగ్రహాలను నిమజ్జనం చేయాలన్నారు.

ముగిసిన శ్రావణమాస పురాణ ప్రవచనాలు



శ్రావణమాస పురాణ ప్రవచనాల ముగింపులో ప్రసంగిస్తున్న గవిమఠం ఉత్తరాధికారి

ఉరవకొండ: ప్రసిద్ధిగాంచిన ఉరవకొండ గవిమఠం మహా సంస్థానం మొదటి పీఠాధిపతులు జగద్గురు కృర్త కరిబసవరాజేంద్రస్వామి పురాణ ప్రవచనాల ముగింపు కార్యక్రమం గురువారం నిర్వహించారు. గవిమఠం ఉత్తరాధికారి డాక్టర్ కరిబసవ రాజేంద్రస్వామి ఆధ్వర్యంలో జూలై 29న ప్రారంభమైన ప్రవచనాలు ముగిశాయి. ఈసందర్భంగా గవిమఠం ఉత్తరాధికారి మాట్లాడుతూ నెల రోజుల పాటు మొదటి పీఠాధిపతుల వారికి విశేష పూజలు, స్వామి వారి పురాణ ప్రవచనాలు నిర్విరామంగా సాగాయన్నారు. ప్రవచన కర్త హనుమంతప్ప అద్భుతంగా స్వామి వారి విశిష్టత, మహిమలు వివరించినట్లు తెలిపారు. అనంతరం భక్తులకు అన్నదాన సేవ నిర్వహించారు.

సర్వసభ్య సమావేశం వాయిదా

గుమ్మఘట్ట: మండల పరిషత్ కార్యాలయంలో గురువారం జరగాల్సిన సర్వసభ్య సమావేశాన్ని వాయిదా వేసినట్లు ఎంపీడీఓ రామకృష్ణ ఓ ప్రకటనలో తెలిపారు. సభ్యుల కోరం లేక శుక్రవారానికి వాయిదా వేసినట్లు ఆయన తెలిపారు. శుక్రవారం జరిగే సమావేశానికి ఎంపీటీసీలు, సర్పంచులు, మండల స్థాయి అధికారులు తప్పక హాజరు కావాలని ఆయన కోరారు.